ప్రజాశక్తి

ఆదివారం 2 జూన్ 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

సిఎం జగన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని శనివారం తెల్లవారుజామున ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు పలువురు మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు ఘన స్వాగతం పలికారు. ఎంపీలు విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, మంత్రులు జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాల కష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, కొట్టు సత్యనారాయణ,



ఎంఎల్ఎలు వల్లభనేని వంశీ, వెలంపల్లి శ్రీనివాసరావు, కైలే అనిల్ కుమార్, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, టిజె.సుధాకర్ బాబు, కోన రఘుపతి, ముదునూరి ప్రసాదరాజు, శిల్పా చక్రపాణిరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి, ఎంఎల్‌సిలు తలశిల రఘురాం, రుహుల్లా, మొండితోక అరుణ్ కుమార్, మైలవరం వైసిపి అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, విజయవాడ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్, గుంటూరు ఈస్ట్ ఎంఎల్ఎ అభ్యర్థి నూర్ ఫాతిమా, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ తదితరులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

చంద్రబాబు రాక

టిడిపి అధినేత చంద్రబాబు శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. సిఎం, సిఎం అంటూ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు అందరికీ అభివాదం చేస్తూ రోడ్డు మార్గాన ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లారు. పోలింగ్ ముగిసిన తర్వాత విదేశీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు.. దాదాపు మూడు వారాల తర్వాత తిరిగి



అమరావతి వచ్చారు. చంద్రబాబుకు స్వాగతం పలికిన వారిలో టిడిపి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎంఎల్ఎ బోడె ప్రసాద్, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమా మహేశ్వరరావు ఉన్నారు.

అంతుపట్టని ఓటరు నాడి!

- సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ విడుదల
- గెలుపోటములపై భిన్న అంచనాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఈనెల నాలుగో తేదీన జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ప్రజలు ఉత్తంఠతతో ఎదురు చూస్తున్నారు. ఈవిఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించేందుకు మరో రెండు రోజులు గడువుంది. ఈ నేపథ్యంలో దేశంలో చివరి దశ ఎన్నికలు శనివారం ముగిసిన వెంటనే సర్వే, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించాయి. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధిక్యత స్థానాలు సాధిస్తుందని మెజారిటీ సర్వే సంస్థలు విశ్లేషించాయి. మరికొన్ని సంస్థలు వైసిపి ఆధిక్యత సాధిస్తుందని ప్రకటించాయి. ఏ పార్టీకి అనుకూలమైన సర్వేలను ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పునర్విభజనకు ముందు అసెంబ్లీ స్థానాల ప్రాతిపదికన ఆరు సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. 16 అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుస్తారని కెకె.స్మార్ట్‌పోల్, సర్వే ఫ్యాక్టరీ, చాణక్య స్ట్రాటజీ సంస్థలు వెల్లడించాయి. ఆత్మసాక్షి సంస్థ మాత్రం అధికార వైసిపి 6 అసెంబ్లీ స్థానాలు, టిడిపి ఐదు స్థానాలు గెలుచుకుంటాయని, మరో ఐదు స్థానాల్లో టిడిపి, నాలుగు స్థానాల్లో పోటాపోటీగా పోరు సాగిందని విశ్లేషించింది. బందరు పార్లమెంట్ స్థానాన్ని కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, విజయవాడ పార్లమెంట్ స్థానాన్ని వైసిపి అభ్యర్థి కేశినేని నాని గెలుచుకుంటారని పేర్కొంది. డబ్ల్యూఆర్‌ఎపి మాత్రం రెండు పార్లమెంట్‌లతోపాటు 14 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులు గెలుపొందుతారని పేర్కొంది.



ఉమ్మడి కృష్ణాజిల్లా అసెంబ్లీ స్థానాలపై ఎగ్జిట్ పోల్స్ సంస్థల విశ్లేషణ

సర్వే సంస్థ పేరు	వైసిపి	కూటమి	పోటాపోటీ	పార్లమెంట్
కెకె సర్వే	--	16	--	కూటమి 2
స్మార్ట్‌పోల్	2-4	12-14	--	కూటమి 2
డబ్ల్యూఆర్‌ఎపి	14	---	02	వైసిపి 2
సర్వే ఫ్యాక్టరీ	04	10	02	కూటమి 2
శ్రీ ఆత్మసాక్షి	06	05	04	వైసిపి 1, కూటమి 1
చాణక్య స్ట్రాటజీ	02	13	01	కూటమి 2

కూటమికి రెండు అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే ఆధిక్యత ఉంటుందని విశ్లేషించింది.

వైసిపి కీలక నేతలకు గట్టిపోటీ!

పెనమలూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు, గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీ తదితరులు గట్టిపోటిని ఎదుర్కొంటున్నారని కొన్ని సర్వే సంస్థలు విశ్లేషించాయి.

అదుపులోకి రాని అతిసార

- 9కి చేరిన మృతుల సంఖ్య
- ప్రత్యేక వార్డులో 8 మంది

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్ : నగరంలో అతిసార అదుపులోకి రావడంలేదు. రోజురోజుకూ కేసులు పెరిగిపోతున్నాయి. విరోచనాలు, వాంతులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య భారీగా ఉంటోంది. బాధితులు నగరంలోని పలు ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు 35 మంది వరకు చికిత్స పొందుతున్నారు. శనివారం తెల్లవారుజామున మొగల్రాజపురం ప్రాంతంలో గల్లా కోటేశ్వరరావు అనే వ్యక్తి మరణించడంతో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో 50 మంది వరకు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉంటే శనివారం ఒక్కరోజే నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రి నుండి 12 మంది డిశ్చార్జి అయినట్లు సమాచారం.

గోప్యంగా చికిత్స

అతిసార లక్షణాలతో ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన కొంత మందికి గోప్యంగా చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. అతిసార లక్షణాలతో ఆస్పత్రికి వెళ్లిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసినా డాక్టర్లు మాత్రం వారిని జనరల్ వార్డుకు పంపి చికిత్స అందిస్తున్నారు. సాధారణ లక్షణాలుగా పరిగణించి చికిత్స అందిస్తున్నారు. అయితే అతిసారతోపాటు ఇతర వ్యాధుల లక్షణాలుగా పరిగణించి చికిత్స అందిస్తున్నామని, వారికి ఎటువంటి ఇబ్బంది లేదని, ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని చెబుతున్నారు.

ప్రత్యేక వార్డులో 8 మందికి చికిత్స

నగరంలోని ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వార్డులో శనివారం 8 మంది అతిసార బాధితులు చికిత్స పొందుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో 30 పడకలతో ప్రత్యేక వార్డును



కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శిస్తున్న సిపిఎం నాయకులు బాబూరావు

ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారిలో మొగల్‌రాజపురం, సింగ్‌నగర్ పరిసర ప్రాంత వాసులు ఉన్నారని తెలిపారు. శనివారం ఒక్కరోజులోనే 11 మందిని డిశ్చార్జి చేశామని తెలిపారు.

కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించిన సిపిఎం నేతలు

శనివారం తెల్లవారుజామున అతిసారతో మరణించిన మొగల్రాజపురం గుమ్మడి తోట ప్రాంతానికి చెందిన గల్లా కోటేశ్వరరావు (65) మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబురావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పి.మురహరి, జి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు. నీటి కాలుష్యం వల్లే కోటేశ్వరరావు మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత ఆరు రోజుల నుండి వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడ్డారని తెలిపారు. అతిసారతో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, బాధితులకు వైద్య ఖర్చులు చెల్లించాలని కోరుతూ శనివారం బాధితుల కుటుంబ సభ్యులతో కలిసి సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

హింసాత్మక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ఏలూరు ఐజి అశోక్ కుమార్

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అవాస్తవాలను షేర్ చేసినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలను పోస్ట్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయాన్ని శనివారం ఐజిపి కుమార్, కష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కౌంటింగ్ కేంద్రం బద్ధ బందోబస్తును, మూడంచెల భద్రతను, సీసీ కెమెరాల నిర్వహణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఐజిపి అశోక్ కుమార్ మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున జనం గుంపులు గుంపులుగా ఉండకుండా ఆ ప్రాంతాన్ని రెడ్ జోన్ గా ప్రకటించామని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా డ్రోన్లను ఎగరవేయకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు వివరించారు. కౌంటింగ్ కేంద్రాన్ని నో స్మోకింగ్, నో ఆల్కహాల్ జోన్‌గా ప్రకటించామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలు, ఎపిఎస్‌పి, ఎస్‌పిఎఫ్ సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అశోక్‌కుమార్, ఎస్‌పి నయీం



కళాశాల ఉద్యోగిని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉయ్యూరు : విద్యార్థుల నుంచి వసూలు చేసి సొంతానికి వాడుకున్న ఫీజు చెల్లించాలని కళాశాల యాజమాన్యం హేళనగా మాట్లాడి, అవమానించారని ఆరోపిస్తూ విజయవాడ లయోలా కళాశాలలో ఉద్యోగి గుంజా లక్ష్మి (33) శనివారం ఉయ్యూరులోని తన నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఉయ్యూరు సిఐ హబీబ్ బాషా కథనం ప్రకారం.... విజయవాడ పటమటకు చెందిన గుంజా లక్షికి గండిగుంటకు చెందిన పంది చైతన్యతో 2015లో వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ లయోలా కళాశాలలో ఉద్యోగాలు చేస్తూ ఉయ్యూరు పశువైద్యశాల సమీపంలోని ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. లక్ష్మీ కళాశాల ఆఫీసులో పనిచేస్తుండగా, ఆమె భర్త చైతన్య ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అయితే కళాశాల విద్యార్థులు చెల్లించిన ఫీజులను లక్ష్మీ తన సొంతానికి వాడుకుంది. దీంతో వాడుకున్న డబ్బులు వెంటనే కట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, అకౌంటెంట్ విజయలక్ష్మి, సింహాచలం విద్యార్థుల ముందు గట్టిగా మాట్లాడారు. వెంటనే చెల్లించాలని ఆమెపై ఒత్తిడి చేశారు. దీనిని అవమానంగా భావించిన ఆమె శనివారం ఉద్యోగానికి బయలుదేరుతూ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న భర్త వెంటనే ఆమెను ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ మరణించింది. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు, తన చావుకు వారే కారణమని పేర్కొంటూ రాసిన సూసైడ్ నోట్ ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో లభించింది. అయితే తనకుమార్తె మరణంపై, అల్లుడు చైతన్య, అతని తల్లి తండ్రులపైనా అనుమానం ఉందని లక్ష్మీ తల్లి కష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించిన సత్యబాబు

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలోని హెడ్ వాటర్ వర్క్సును శనివారం సిపిఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు పరిశీలించారు. నగరంలో మంచినీటి కాలుష్యం, మంచినీరు రంగు మారి సరఫరా అవుతున్న నేపథ్యంలో ఆయన ఈ పర్యటన జరిపారు. అనేక నెలలుగా రంగు మారిన నీరు 11 ఎంజిడి ప్లాంట్ ద్వారా, 16 ఎంజిడి ప్లాంట్ ద్వారా నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ నీరు దుర్వాసన వస్తోందన్నారు. పలుచోట్ల నీటి కాలుష్యం కారణంలో ప్రజలు మరణిస్తున్నారని, వందల సంఖ్యలో వాంతులు విరోచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు. ఈసందర్భంగా హెడ్‌వాట్ వర్క్స ఎఇ బసిరెడ్డి... వాటర్ ఫిల్టరేషన్ జరుగుతున్న విధానాన్ని ఆయనకు వివరించారు. మంచినీరు రంగు మార్చే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫైవ్ ఎంజిడి వాటర్ ప్లాంట్ ద్వారా వస్తున్న ఫిల్టర్ వాటర్ తెల్లగా ఉంటోందన్నారు. ఆవిధంగా మిగిలిన వాటర్ ప్లాంట్ మంచినీరు ఎందుకు తెల్లగా రావడం లేదని బి సత్యబాబు ప్రశ్నించారు. సంబంధిత వాటర్ బోర్డు టెక్నికల్ సిబ్బందితో మాట్లాడి నివారణ చర్యలు చేపడతామని తెలిపారు.



రిటైర్డు ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-విజయవాడ : నగరపాలక సంస్థలో సుదీర్ఘ కాలంపాటు వివిధ హోదాలలో ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ అయిన ఉద్యోగులను విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన సత్కరించారు. ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (జనరల్) మహేష్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ కరీముల్లా పాల్గొన్నారు. నగరపాలక సంస్థలో వివిధ హోదాలలో ఉత్తమ సేవలు అందిస్తూ అధికారులు, సహ ఉద్యోగుల మన్ననలు పొందిన ఉద్యోగులను అభినందించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1 కె. నారాయణ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ (సర్కిల్ -3)సి.హెచ్ రామ్ కోటేశ్వరరావు, సర్కిల్-1 రెవిన్యూ సెక్షన్ ఆఫీస్ సబార్డినేట్ పి.జగదీశ్‌లను అతిథిలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ రమణారెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎస్.వి.ఎస్.చలం, ప్రెసిడెంట్ దార రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ మురళీకష్ణ, జాయింట్ సెక్రెటరీ టి.ప్రతాప్ కుమార్, ట్రెజరర్ నాగరాజు, కమిటీ సభ్యులు గుర్రం వెంకటేశ్వరరావు, రాజేంద్ర చేతన్, గోపాలకష్ణ, అశోక్ కుమార్, కొమర కిషోర్ కుమార్, రత్నం, దారా ఆంటోని, ముదరబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పటిష్ట ప్రణాళికతో ఓట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : సాధారణ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నోవా, నిమ్రా కళాశాలల్లో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లు, కౌంటింగ్ రోజు భద్రతా ఏర్పాట్లు తదితరాలపై కలెక్టర్ డిల్లీరావు, పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకష్ణ.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ఓట్ల లెక్కింపును విజయవంతం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది సకాలంలో చేరుకునేలా చేయడంతో పాటు వాహనాల పార్కింగ్, భద్రత, మొబైల్ ఫోన్ల కలెక్షన్ పాయింట్లు, ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, అంబులెన్సులు, వైద్య శిబిరాలు, ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సూచిక బోర్డుల ఏర్పాట్లు, గుర్తింపు కార్డుల జారీ, అంతరాయం లేని విద్యుత్ సరఫరా, టెంట్లు, కుర్చీలు వంటి వసతుల ఏర్పాటు, అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు, మీడియా సెంటర్ తదితరాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంతోపాటు కేతనకొండ, కొండపల్లి తదితర ప్రాంతాల నుంచి బస్సుల ఏర్పాటుకు సంబంధించి సూచనలు చేశారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఆరు గంటలకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకష్ణ తెలిపారు. పార్కింగ్, ఎంట్రీ గేట్, మొబైల్ కలెక్షన్ పాయింట్లు తదితరాల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు. ఈసమావేశంలో డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, రిటర్నింగ్ అధికారులు బీహెచ్ భవానీ శంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు, ఇ.కిరణ్మయి, జి.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ కె.సునీత తదితరులతో పాటు పోలీస్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంధాలయంలో శనివారం చెస్‌లో శిక్షణ ఇచ్చారు. విజయవాడలోని గాంధీ ఆశ్రమం నుండి ఆర్ఆర్ గాంధీ నాగరాజన్న విచ్చేసి గాంధీ, అంబేద్కర్ ఆలోచనా విధానాలను విద్యార్థులకు వివరించారు. గ్రంధాలయ అధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపు పటిష్టంగా నిర్వహించాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఓట్ల లెక్కింపు పటిష్ట వంతంగా నిర్వహించి సకాలంలో ఫలితాలు ప్రకటిం చాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన కష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు చేపట్టమన్న దష్ట్యా, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో శనివారం కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌంటింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ నిర్వహించి ఆయా నియోజకవర్గాలవారీ ఓట్ల లెక్కింపు విధులకు సిబ్బందిని కేటాయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సిబ్బందికి జూన్ 2వ తేది ఆదివారం మచిలీపట్నంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వివిధ ప్రదేశాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ పార్టీల అభ్యర్థులకు, స్వతంత్రులకు, వారి పోలింగ్ ఏజెంట్లకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వీరికి శిక్షణ సమాచారం చేరవేయాలన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సిబ్బందికి జడ్పీ కన్వెన్షన్ హాల్లో, గన్నవరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సిబ్బందికి కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాలులో, గుడివాడ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సిబ్బందికి జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో, పెడన నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సిబ్బందికి స్థానిక లేడీ యాంప్థిల్ జూనియర్ కళాశాలలో, మచిలీపట్నం నియోజక వర్గం కౌంటింగ్ సిబ్బందికి స్థానిక నోబుల్ కళాశాల(సైన్స్ బ్లాక్)లో, అవనిగడ్డ నియోజకవర్గం సిబ్బందికి స్థానిక చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హైస్కూల్లో, పామర్రు నియోజకవర్గ సిబ్బందికి స్థానిక నిర్మల హైస్కూల్లో, పెనమలూరు నియోజకవర్గం కౌంటింగ్ సిబ్బందికి నోబుల్ కళాశాల (లైబ్రరీ బిల్డింగ్)లో శిక్షణ నిర్వహించ నున్నట్లు తెలిపారు. కావున కౌంటింగ్ సిబ్బంది ఈ శిక్షణకు హాజరు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు ఎం. వాణి, పి. పద్మావతి, డి. రాజు, పామర్రు రిటర్నింగ్ అధికారి శ్రీదేవి, అవనిగడ్డ రిటర్నింగ్ అధికారి బాలసుబ్రమణ్యం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఆత్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ సీఆర్పీసి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, దీనిని అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు అన్నారు. శనివారం స్టేషన్ పరిధిలో గల తేలప్రోలు జోసఫ్ నగర్ నందు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విస్బల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో పైడిబాబు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతోందని, ఈ కౌంటింగ్ శాంతియుత వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో ఏ విధమైన అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండాలంటే అందరూ సహకరించా లన్నారు. ఎక్కడా గుంపులుగా చేరడం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చట్ట విరుద్ధం అని, దీనికి చర్యలు ఉంటాయని అన్నారు. అదేవిధంగా ఈ నెల 4,5,6 తేదీలలో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణాసంచా కాల్చడం, పబ్లిక్ మీటింగ్ జరపడం నిషేధం అని దీనిని అధిగమించి ఏ విధమైన చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారికి ముందస్తు హెచ్చరిక నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది జోసఫ్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.



కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలి

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలో పలు గ్రామాల్లో పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికలు తీయాలని రైతుసంఘ మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వెనక గల సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కంకిపాడు మండలంలో గొడవర్రు లాకు వద్ద, అక్కడ నుండి మండలంలోని పలు గ్రామాలైన ప్రొద్దుటూరు, నెప్పల్లి కోలవెన్ను, ఈడుపుగల్లు మొదలగు గ్రామాలలోని పంట కాలువల్లో గుర్రపు డెక్క పూడికలు తీయాలన్నారు. అలాగే పంట కాలువలకు అమర్చిన లాక్ గేటులను మరమ్మత్తులు చేసి వర్షాకాలంలో అధిక వర్షపాతం వచ్చినప్పుడు రైతుల పంట పొలాలు నీట మునిగిపోకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జోజితోపాటు కొందరు రైతులు పాల్గొన్నారు.

జపమాలమాత ముగింపు ఉత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కోటగిరి లంకలో గల ఆర్సిఎం చర్చిలు జపమాలమాత ముగింపు ఉత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు కుటుంబ దేవాలయం మేరీ మాత ఊరేగింపు కార్యక్రమం కోటగిరి లంక సీతయలంక మరియపురం(సింహాద్రి కాలనీ) లలో నిర్వహించారు. విచారణ గురువు సురేష్ మెర్లో, ఫాదర్ గురుముచ్చు క్రీస్తురాజు మేరీ మాత స్వరూపాన్ని ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు గహాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలతో పాటు ఆయా గ్రామాలను విచ్చేసిన విశ్వాసులు పాల్గొన్నారు.

రెడ్‌జోన్‌గా కౌంటింగ్ కేంద్ర ప్రాంతం : ఎస్‌పి



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కౌంటింగ్ కేంద్ర ప్రాంతం చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ గా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్పష్టం చేశారు. జూన్ 4 న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మచిలీపట్నం కష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగనున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధి ని రెడ్ జోన్ గా పరిగణస్తూ జిల్లా కలక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, కాబట్టి ఆ ప్రదేశాలలో అనధికారికంగా ఎటువంటి అనుమతులు లేకుండా బయట వ్యక్తులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు అసంఖ్యాకంగా గుమి గూడటం, అటు ఇటూ సంచరించడం నేరంగా పరిగణిస్తామన్నారు. అంతేకాకుండా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రెడ్ జోన్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరవేయటం నిషేధమన్నారు. ఈ నిషేధం. నిబంధనలు అతిక్ర మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలీసువారి ఆదేశా లను మీరి డ్రోన్లను ఎగరవేసిన వారిపై ఈ కింది సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుం టామన్నారు. ఈ నిషేధాజ్ఞలు జూన్ 10 తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కాబట్టి ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ప్రజలు, రాజకీయ నాయకులు ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



గుడివాడలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గుడివాడ : కష్ణాజిల్లా ఎస్పీ ఆదేశానుసారం, గుడివాడ డిఎస్పి సూచనల మేరకు గుడివాడ పట్టణ వన్ టౌన్ సిఐ కె.ఇంద్ర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ధనియాలపేట న్యూ కాలనీలో పోలీస్ శాఖ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఇంటింటికి వెళ్లి పూర్తిగా తనిఖీలు నిర్వహించి, వేరే ప్రాంతాల నుంచి ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఉన్నచో వారి వివరాలు అడిగి తెలుసున్నారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు



గుడివాడలో...

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం మాజీ గ్రంథాలయ ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు, సాహితి ప్రవంతి నిర్వాహకుడు లంకా సురేంద్రలు విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించి, నీతి కథలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహ కురాలు పి.శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పఠన సామర్థ్యాన్ని కథలు చదివించడం, వాటిని చదివి నియమించడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందిం చుకున్నట్లు గ్రంథల అధికారిని టి వాణి తెలిపారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, క్యారమ్స్ పాటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.



గుడ్లవల్లేరులో...



పావని, జ్ఞానశ్రీలను సత్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : బచ్చుపేట ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ ఉత్స వాలలో భాగం గా శుక్రవారం సాయంత్రం భావ తరంగిణి ఆధ్వ ర్యంలో మహతి కళా వేదికలో జరిగిన భరతనాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆకునూరు గ్రామానికి చెందిన యువ కళాకారులు ఎండూరు పావని, జ్ఞానశ్రీ సిస్టర్స్ వివిధ అంశాలను అద్భుతంగా అభినయించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. వివిధ దేవతామూర్తులను స్తుతిస్తూ వారు నాట్య ప్రదర్శన కొనసాగించారు. అనంతరం జరిగిన హాస్య స్కిట్స్ అందరిని కడుపుబ్బా నవ్వించాయి. మనుషుల మనస్తత్వాలు ,ఈనాటి రోగాలు వైద్యాలు, సన్మానాలు వంటి విషయాలను ఆధారంగా చేసుకుని వి వి ఎన్ ఎస్ ప్రభాకర్, డి శ్రీరామ్, భవిష్య , శ్రీమతి పి శాంతి, మేఘ శ్యామ్ లు హుషారుగా నటించి అందరికీ నవ్వులు పంచారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య ,సి అప్పాజీ, సవరం వెంకటేశ్వరరావు,జి.రాం బ్రహ్మం, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ సతీమణి వెంకటలక్ష్మి పెద్దిరాజు, అప్పి నేడు పోతరాజు, కే చంద్రశేఖర్, శిరీష లు కళాకారులను అభినందించి జ్ఞాపికలతో సత్కరించారు.

'శ్రీమతి అమరావతి'కి బెస్ట్ ఈవెంట్ అవార్డు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీమతి అమరావతి ఈవెంట్‌కు బెస్ట్ ఈవెంట్ అవార్డు దక్కించుకుందని తేజాస్ ఎలైట్ ఈవెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ చౌదరి తెలిపారు. ప్రపంచ ఈవెంట్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును తనకు అందచేశారని ప్రదీప్ చౌదరి ప్రకటనలో తెలియజేశారు. పెళ్లి అయిన మహిళల్లో ఉన్న ప్రతిభ,సజనాత్మక శక్తిని గుర్తించి వారిలోని ప్రతిభను బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు గత 9 సంవత్సరాలుగా శ్రీమతి అమరావతి పేరుతో సాంప్రదాయ దుస్తుల ఫ్యాషన్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ షోలో భాగంగా మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు వివిధ పోటీలను నిర్వహించి పలు విభాగాల్లో శ్రీమతి అమరావతి టైటిల్‌ను విజేతలకు అందచేశామని వివరించారు. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి విశేషమైన స్పందన వచ్చిందని పేర్కొన్నారు. మహిళల నుంచి అంత ఆదరణ పొందిన శ్రీమతి అమరావతి ఫ్యాషన్‌షోను గుర్తించి బెస్ట్ ఈవెంట్‌గా అవార్డు ఇవ్వడం చాలా



సంతోషంగా ఉందని ప్రదీప్ తెలియజేశారు. తెలంగాణా ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ప్రతిన్యిధులు రాజా, వందన అతిధులుగా హజరై ఈ అవార్డును తనకు అందచేశారని ఆయన వివరించారు.

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్‌లో వాంతులు విరేచనాలతో బాధితులు ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలో



చికిత్స పొందుతున్నారు. దీనిపై స్పందించిన జిల్లా మెడికల్ అధికారి ఆదేశాల మేరకు ఏరియా వైద్య సిబ్బంది ప్రజాశక్తి నగర్‌లో శనివారం ఇంటింటికి సర్వే నిర్వహించారు. దానిలో భాగంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాచి చల్లార్చిన నీళ్ల మాత్రమే తాగాలని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. అతిసార వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యూనివర్సల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డ్రైవ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యూనివర్సల్ సోంపో, బీమా విస్తరణ, అవగాహనను పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ఇంఛార్జి ఎం.కరుణ కుమార్ తెలిపారు నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు.. 2047 నాటికి అందరికీ బీమాను సాధించాలనే ఐఆర్డీఏఐ లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తుంది అని తెలిపారు., యూనివర్సల్ సోంపో వివిధ రంగాలలో బీమా కవరేజీని ప్రోత్సహించడానికి ప్రభావవంతమైన కార్యకలాపాలను ప్రారంభించింది. అని తెలిపారు మారుతీ సుజుకి ఇన్సూరెన్స్ బ్రోకింగ్ భాగస్వామ్యంతో, యూనివర్సల్ సోంపో ఉచిత వాహన చెకప్‌లను అందించే సరికొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది అన్నారు.. 'సురక్షిత రేపటి కోసం ఈరోజే బీమా చేయండి' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, ఊహించని ప్రమాదాలను తగ్గించడంలో బీమా ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు.



క్రీడాకారునికి అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 22 నుండి 24 వరకు జరిగిన స్పోర్ట్స్ మీట్ లో జగ్గయ్యపేట రామ్ కో సిమెంట్స్ (చిల్లకల్లు ఓన్ హౌస్) నకు చెందిన రామిశెట్టి నరసింహారావు 55 సంవత్సరాల విభాగంలో 5 కె మీ వాక్ లో మూడవ స్థానాన్ని, అదేవిధంగా ట్రిపుల్ జంపులో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుని మెడల్స్ ను గెలుపొందారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసంలో తాతయ్యని నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్య రామిశెట్టి నరసింహారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో వి. అనిల్ కుమార్, ఎ. అనంత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామములో గల పవిత్ర పుణ్య క్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి రోజు జరుగుచున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతి వాస్తవ్యులు ధరణి సిన్ సి యాజమాన్యం వారు కొత్త రంగారావు, స్వరూప రాణి దంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాతలకు శ్రీ స్వామి వారి శేషవస్త్రములు మరియు ప్రసాదములు ఆలయ అర్చకులు తిరునగరి రామకష్ణమాచార్యులు మరియు సిబ్బంది అందజేయటం జరిగిందని సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సి. జయప్రకాష్ బాబు తెలిపారు.

నీటి కాలుష్యానికి నిర్లక్ష్యమే కారణం : సిపిఐ



ప్రజాశక్తి-వన్‌టౌన్: నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగానే కష్ణమ్మ చెంతనే ఉన్నా విజయవాడ నగర ప్రజలు తాగునీటి కోసం అల్లాడాల్సిన దుస్థితి వచ్చిందని, కలుషిత నీటి కాటుకు బలికావల్సి వచ్చిందని, వందలాదిమంది డయేరియా బారినపడాల్సిన దయనీయ పరిస్థితి తలెత్తిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. కలుషిత నీరు తాగి మరణించిన వారి కుటుంబాలకు తక్షణమే నగరపాలక సంస్థ ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, డయేరియా బారినపడిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా చికిత్స అందించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం వన్ టౌన్ లెనిన్ భవన్ లో విలేకరుతో జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ 'నగరంలో వేసవికి ముందే తాగునీ ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ తరపున నగర పాలక సంస్థ అధికారులు, మేయర్, ప్రజాప్రతినిధులను కోరామని తెలిపారు. స్వయంగా మేయర్ డివిషన్‌లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, కొండ ప్రాంత ప్రజలు తాగునీటికోసం అల్లాడుతున్నారు. పైపులైన్ల కోసం గోతులు తవ్వి వదిలేశారని. అయినా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. నగరంలో చాలాకాలం కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లు తప్పు పట్టి లీకవుతున్నాయి. పైపులైన్లు సైడుకాలువలు, డ్రైయిన్లలో ఉండటం వల్ల నీరుకలుషితమయ్యే ప్రమాదం ఉందని మేం ముందుగానే హెచ్చరించమని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా లీకైన పైపులకు రబ్బరు ట్యూబులతో మరమ్మతులు చేస్తున్నారని, దీనివల్ల నీరు కలుషితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగానే మొగల్రాజపురం ప్రాంతంలో కలుషితనీరు కారణంగా నలుగురు మరణించారని, వందలాదిమంది డయేరియాబారిన పడ్డారని తెలిపారు. ఇందుకు పూర్తిగా కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరిచి దెబ్బతిన్న పైపులైన్లను తొలగించి కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలి. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా పటిష్ట చర్యలు తీలుకోవాలన్నారు. లేకపోతే సీపీఐ పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం అవుతుంది' అని జి.కోటేశ్వరరావు చెప్పారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-మైలవరం
వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముందుగా బామ్మ చెప్పిన బంగారు నీతి కథల పుస్తకాలు విద్యార్థులు చే చదివించి చెప్పించారు. ఎంబిఎం జడ్పీహెచ్ఎస్ స్కూల్ మైలవరం జీవశాస్త్రం ఉపాధ్యాయులు డి రాంప్రసాద్‌రావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని కాబట్టి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది, పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-తిరువూరు
విద్యార్థులు వేసవి సెలవుల్లో నైపుణ్యాలు పెంపొందించు కోవడానికి కృషి చేయాలని తిరువూరు గ్రేట్-1 శాఖ గ్రంథాల అధికారిణి పద్మావతి అన్నారు. తిరువూరు గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతుల్లో నిరుపయోగంగా ఉన్న మంచినీటి సీసాలతో ఫ్లవర్ వాజ్ లు, పెన్ స్టాండ్ తయారు చేయడం పై సెక్షన్ ఇచ్చారు. చదువుతోపాటు తమకున్న ఆసక్తి మేరకు నైపుణ్యా లను సాధించడంలో విద్యార్థులకు తల్లిదండ్రులు శిక్షణ ఇవ్వాలని పద్మావతి సూచించారు. పుస్తక పఠనం, పద్యాలు చదవడంలో శిక్షణతో పాటు యోగా, మెడిటేషన్‌లపై అవగాహన కల్పించారు.

ఉత్కర్ష్ ఎస్‌ఎఫ్‌బిఎల్ నూతన అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఉత్కర్ష్ ఎస్ ఎఫ్ బి ఎల్) బ్యాంక్ 900వ అవుట్‌లెట్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ గోవింద్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ బ్యాంకు విస్తృత విస్తరణలో భాగంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ అంతటా నూతనంగా ప్రారంభించిన ఏడు కొత్త అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. దీంతో బ్యాంక్ ఇప్పుడు జార్ఖండ్‌లో 81 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లను, దేశవ్యాప్తంగా మొత్తం 903 అవుట్‌లెట్‌లను నిర్వహిస్తోందన్నారు. రాంచీలోని కుంతీ కస్టమర్‌లు ఇప్పుడు బ్యాంక్ ఉత్పత్తులు సేవల యొక్క విస్తృత శ్రేణికి ప్రాప్యతను కలిగి ఉంటారన్నారు. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో పొదుపు ఖాతాలు, కరెంట్ ఖాతాలు, స్థిర డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, గృహ రుణాలు, వ్యాపార రుణాలు, ఆస్తిపై రుణాలు, క్రెడిట్, బీమా పెట్టుబడి ఉత్పత్తులు వంటి వివిధ రుణ ఉత్పత్తులు ఉన్నాయన్నారు. బ్యాంక్ యొక్క విస్తృతమైన అవస్థాపన, డిజిటల్ బ్యాంకింగ్ సామర్థ్యాలు ఏటీఎం నెట్‌వర్క్ సమీకత కస్టమర్ సేవను అందించడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

శ్వేత విప్లవ పితామహుడు కురియన్‌కు నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రపంచ పాల దినోత్సవ వేడుకల సందర్భంగా శ్వేత విప్లవ పితామహుడు కురియన్‌కు కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



కురియన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చలసాని

ఘనంగా నివాళులర్పించారు. శనివారం కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా సమితి ఆవరణ లో గల శ్వేత విప్లవ పితామహుడు కురియన్, మ్యాక్స్ చట్ట రూపకర్త నందమూరి తారక రామారావు, ఆంధ్ర ప్రదేశ్ డెయిరీ రంగ వ్యవస్థాపకులలో ముఖ్యులు కాకాని వెంకటరత్నం కాంస్య విగ్రహములకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ఐక్యరాజ సమితిలోని ఆహార, వ్యవసాయ సంస్థ పాల వల్ల కలిగే ప్రయోజనాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవం గా పాటిస్తుందని గుర్తు చేసారు. నాణ్యమైన పాశ్చరైజ్డ్ పాల వల్ల కలిగే ప్రయోజనాలతో పాటుగా, ప్రస్తుత మార్కెట్టు లో లభ్యమవుతున్న కల్తీ పాలు మరియు పాశ్చరైజ్ చేయని పాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలు పై కూడా వినియోగదారులకు అవగహన కల్పించే బాధ్యత సమాజం పై ఉందని, మరి ముఖ్యముగా కృష్ణా మిల్క్ యూనియన్ కుటుంబ సభ్యులుగా వినియోగదారులకు అవగహన కల్పించాల్సిన బాధ్యత మన పై మరింత వుందని సమితి సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో మేలు

ప్రజాశక్తి-గన్నవరం : పొలాలలో ఏ విధమైన పంటలు సాగు లేని సమయంలో వేసవిదుక్కులతో ఎన్నోప్రయోజ నాలుంటాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.దీంతో రైతులు ఆ దిశలో పయనిస్తున్నారు. వేసవి దుక్కులతో భూమిలో ఉన్న చీడ పురుగులకోశాలు, గుడ్లు బయటపడి ఎండ వేడికి చనిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతుగా దుక్కులు ఉండటంతో పురుగుమందులు వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని స్పష్టం చేస్తున్నారు. రబీ సీజన్లో సాగుచేసిన పంటల అనంతరం నిర్వహించే దుక్కులుతో వరి నాటు కూడా ఉపయోగకారిగా ఉంటుంది. వర్షాలకు ముందు భూమి దున్నుకోవటం వల్ల తొలకరి దికి వర్షాలు పడగానే నీరు పూర్తిస్థాయిలో నేలలోకి వెళుతుంది. ఈ దుక్కులు మూలంగా వేరే గడ్డి జాతి మొక్క లో విత్తనాలు వేసవి ఎండాకాలపులకు మలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు దున్నుకోవటానికి ఎండలు విస్తారంగా వేసే మే నెల, జూన్ మొదటి వారంలో అనుకూలంగా ఉండటంతో రైతులు సాంప్ర దాయ పద్ధతిలో, యాంత్రిక పద్ధతిలో పొలాలను దున్ను కోవడంలో నిమగ్నమైనారు. రబీ సాగులో ఆరుతడి పంట అనంతరం వర్షాలు కురిసేంతవరకు నేలను దుక్కి దున్నకుండా వదిలేస్తే భూమి నిస్సారం గా మారే అవకాశాలు ఉండటంతో దుక్కులు తప్పనిసరిగా దున్నుకోవాలని వ్యవసాయ అధికారులు సూచనలు జారీ చేస్తారు. వేసవికాలంలో పంటలు సాగులో ఉండని సమయంలో చీడ, పీడ పురుగులను తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిని ఆశ్రయించే అవకాశాలున్నాయి. ఈ దశలో వరి, అపరాలు పంటలు ఆశించే తెగుళ్లు, పచ్చ పురుగు, లద్దె పురుగు వంటివి భూమిని ఆశ్రయించుకుంటాయి. వేసవికాలంలో దుక్కులు దున్నుకోవడం వల్ల ఈ పురుగులన్నీ నశించి ఖరీఫ్ సీజన్లో సాగయ్యే పంటకు లబ్ది పొందే అవకాశాలు ఉంటాయి. పూర్వకాలంలో పెంట పోగులు తోలి పొలాలలో జిమ్ముకొన్న తర్వాత రెండు మూడు చాళ్ళు దున్ని వదిలేసేవారు. తరువాత తొలకరి వర్షం పడగానే మరల దున్నుకునేవారు. దీనితో వరి సాగుకు భూమి సారవంతంగా సిద్ధమయ్యేది. ఇదే విషయాన్ని ఆటు అధికారులు.గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో 67 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. రైతులంతా ముందుగా పొలంలో దుక్కులు చేసుకునే పనిలో ఉన్నారు. వరి సాగు చేసే రైతులు ఈ పని చేస్తారు. మెట్ట గ్రామాల్లో మెట్ట పైరులు వేయడానికి అనువైన వాతావరణం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే డీజిల్ పెట్రోల్ ధరలు పెరగడం వల్ల దుక్కులకు ట్రాక్టర్ ఖర్చు పెరిగిందని కౌలు రైతులు తెలిపారు.



ఏజీ అండ్ ఎస్ఎస్ కళాశాలకు 'ఎ' గ్రేడు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీఅండ్ ఎస్ఎస్ కళాశాలకు నేక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సి ల్) నుంచి ఏ గ్రేడు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్ తెలిపారు. కళాశాల లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీల్లో మధ్యప్రదేశ్ రేవాలోని ఏపిఎస్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రామ్ నివాస్ పటేల్ అధ్యక్షతన పశ్చిమబెంగాల్ కళ్యాణిలోని కళ్యాణి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శీతల్ కుమార్ చటోపాధ్యాయ, ముంబైలోని మండలీస్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ గో పాల్ కలకోటి ముగ్గుల సభ్యుల బృందం కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించి బెంగుళూరు లో నేక్ సంస్థకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. నివేదిక పరిశీలించిన స ంస్థ కళాశాలకు ఏ గ్రేడు ప్రకటించిందని, జిల్లాలో ఏ గ్రేడు సాధించిన ఏకైక కళాశాల ఏజీఅండ్ ఎస్ ఎస్ కళాశాల నిలిచిందన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీరామ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకేతతర సిబ్బందిని యాజమా న్యం అభినందించారు.



గన్నవరంలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-గన్నవరం : సార్వత్రిక ఎన్నికలు, కౌంటిం గ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడానికి మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని గన్నవరం డిఎస్పీ జయసూర్య తెలిపారు. జిల్లా ఎస్పీఅద్నాన్ నయం అష్మి ఆదేశాలాపై శనివారం గన్నవరం సబ్ డివిజన్లో ఎస్పీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కే. ఈశ్వరరావు ఆధ్వర్యంలో గన్నవరం లో, సివిల్, ఏఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవ హరిస్తూ జనసమూహాలను నియంత్రించి శాంతిభద్ర తలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యాన్ని సిబ్బందికి వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఏ .ఆర్ అదనపు ఎస్పీ ప్రసాద్, సతీష్ కుమార్, గన్నవరం ఇన్స్పెక్టర్ వరప్రసాద్, హనుమాన్ జంక్షన్ ఇన్స్పెక్టర్ నవీన్ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సాధారణ ఎన్నికల సందర్భంగా జూన్ 4వ తేదీన జిల్లాలోని కష్ణ విశ్వవిద్యా లయంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారద ర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించడం కోసం భారత ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాలకు పరిశీల కులను నియమిం చింది. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చిదానంద ఎస్ ఎస్,. వీరు, గుడివాడ నియోజకవర్గానికి బన్సీలాల్ రాణా, పెడన నియోజక వర్గానికి అనిల్ చంద్ర డియోరి, మచిలీపట్నం నియోజక వర్గానికి జాన్ కింగ్స్ లే ఏ ఆర్, అవనిగడ్డ నియోజక వర్గానికి అఖిలేష్ కుమార్ సింగ్, 77-పామర్రు (ఎస్సీ) నియోజకవర్గానికి రాజీవ్ దత్త, పెనమలూరు నియోజకవర్గానికి అభిజిత్ బోస్‌లను నియమించింది.

కట్టుదిట్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కట్టుదిట్టమైన భద్రత మధ్య జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం కలెక్టరేట్లో ఎన్నికల మీడియా సెంటర్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొని ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు వివరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 14 కౌంటింగ్ టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించి, ఇప్పటికే మొదటి విడత శిక్షణ ఇచ్చినట్లు, జూన్ రెండో తేదీ రెండో విడత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోనికి మొబైల్స్ అనుమతించమని, మొబైల్ డిపాజిట్ కేంద్రంలో మొబైల్స్ ఉంచవలసి ఉంటుందని అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే సార్వభౌములు, ప్రజల తీర్పును గౌరవించాలని, ఫలితాల పట్ల రాజకీయ పక్షాలు సంయమనం పాటించాలని సూచించారు.జిల్లా ఎస్పీ అద్నాన్ నయామ్ అస్మి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. 144 సెక్షన్, సెక్షన్ 30 అమల్లో ఉంటుందన్నారు. డి ఆర్ ఓ కె చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డి. బాలాజీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో మోపిదేవిలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్లు ప్రతి రోజు రెండువేల మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. చల్లపల్లిలో శ్రీ మంతురాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు, మోపిదేవి గ్రామంలో దాతల సహకారంతో ఇప్పటికి 15 వేల మందికి మజ్జిగ పంపిణీ చేసారు. ఎక్కడో సుదూర ప్రాంతాల నుండి మోపిదేవి శ్రీవల్లీ, దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానము వచ్చే భక్తుల కోసం మోపిదేవి మండలంలో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మోపిదేవి దేవస్థానమునకు వచ్చిన భక్తులు ఎండ వేడికి ఉండలేక పడుతున్న ఇబ్బందులను గుర్తించి భక్తులకు తమవంతుగా ఎదో ఒకటి చేయాలని భావించి వర్షాలు పడేవరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తామని అన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని ఊట గుండం గ్రామంలో గత కొద్ది రోజుల కిందట అగ్నిప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన బెల్లంకొండ రత్న కుమారి కుటుంబానికి కష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూరంగారావు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందించి అండగా నిలబడ్డారు. చెన్ను రంగారావు సతీమణి దివంగత చెన్ను ఉమారాణి పుట్టినరోజు సందర్భంగా ఐదు వేల రూపాయలను స్థానిక బీసీ సంఘం నేతల ద్వారా బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు అద్దంకి పాండురంగారావు, గోరిపర్తి శ్రీనివాసరావు, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న దృశ్యం

ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపుల పాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇంటర్ కళాశాల తరగతులు ఇవాళ్టి లాంఛనంగా ప్రారంభమైయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీ వీరవల్లి గ్రామంలో ఏర్పాటు చేయడం ద్వారా చుట్టు ప్రక్కల సుమారు 15 గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి సురేష్ పేర్కొన్నారు. గతంలో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఏటువంటి ఫీజుల వసూళ్లు చేయడం ప్రభుత్వమే ఉచితంగా ఇంటర్ విద్య అందిస్తోంది. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, జూనియర్ కాలేజీ ఇంచార్జి ఆళ్ల కష్ణారావు పేరెంట్స్ కమిటీ కో-ఆప్షన్ మెంబర్ చిలకపాటి పద్మనాభం, పేరెంట్స్ కమిటీ సభ్యులు అలుగుల దేవా, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం పిజి నాలుగవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి జ్ఞాన మణి శనివారం విడుదల చేశారు. విశ్వ విద్యాలయం, అనుబంధ కళాశాలల్లో 829 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 705 మంది ఉత్తీర్ణులు కావడంతో 85.04 ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది. అలాగే 152 మంది సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 69.54 ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య జి జ్ఞానమణి , రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు స్వల్ప కాలంలోనే ఫలి తాలు విడుదల చేయడానికి కృషి చేసిన విశ్వ విద్యాలయ పరీక్షల విభాగం అధికా రులు, సిబ్బందిని అభినంది ంచారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డా కిరణ్ కుమా ర్, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల మళ్లింపుతో ప్రమాదాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: విజయవాడ – భద్రాచలం జాతీయ రహదారిపై కొండపల్లిలో జరుగుతున్న మరమ్మతులు చాలా నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. నాణ్యమైన భద్రతా పరికరాలు పెట్టకుండా వాహనాల మళ్లింపు చేస్తుండడంతో రాత్రివేళ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చేంతవరకు సేఫ్టీ పరికరాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సేఫ్టీ పరికరాలు కనిపించకపోవడంతో పాటు బారికేడ్స్ కూడా పెట్టకపోవడం వల్ల వాహదారులు దూసుకుపోవటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇదే విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్ దష్టికి తీసుకు వెళ్ళగా నిర్లక్ష్యంగా దురుసుగా సమాధానం చెప్పడంతో వాహనదారులు మండిపడుతున్నారు. జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పనులు జరగకుండా అడ్డుకుంటామని తెలియజేస్తున్నారు. నిర్లక్ష్యంగా పనులు కొనసాగిస్తుండటంతో ఇటు



వాహనదారులు, అటు పనులు నిర్వహించే రహదారి నిర్వహణ కార్మికులు సైతం ప్రమాదాలకు లోనవడం జరుగుతుంది.

క్రికెట్‌లో రాణించిన జగ్గయ్యపేట క్రీడాకారులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గుంటూరు జిల్లా నరసరావుపేట గ్రౌండ్ లో గత నెల 31 వ తేదీన జరిగిన అండర్ 19 వన్ డే సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ లో కష్ణా జట్టు, ప్రకాశం జిల్లా జట్టు తలపడగా కృష్ణా జట్టు తలపడగా 206 పరుగుల తేడాతో గెలుపొందింది. కృష్ణా జిల్లా కెప్టెన్ టి.వరుణ్ సాత్విక్ 65 బాల్స్ ఆడి 108 పరుగులు నాటౌట్ ఇందులో 9 బౌండరీలు, 8 సిక్సలు వున్నాయి. మరియు బౌలింగ్ లో 2 వికెట్లు తీసుకున్నాడు. ఎన్ రాజేష్ 2 వికెట్లు తీసుకున్నాడు. వీరు జగ్గయ్యపేట ఏసిఏ, కేడిసిఏ బివి సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.



వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండలం లోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో వరి విత్తనములైన ఎమ్.టి.యూ – 1061, బి.పి.టి – 5204 మరియు ఎమ్.టి.యూ 1224 వరి రకాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి తెలియజేసారు. శనివారం నరసాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వరి విత్తనముల పంపిణీ ప్రారంభించారు. ఖరీఫ్ సాగుకు వరి విత్తనములు కావలసిన రైతులు వారి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్దకు పాస్ బుక్ వివరాల తో వెళ్లి విత్తనములు కొనుగోలు చేసుకోవలసిందిగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ రాజ్యలక్ష్మి తో పాటు వ్యవసాయ సహాయకురాలు ఉషా, సచివాలయం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.





కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంధాలయ సంచాలకుల ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంధాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులు పుస్తక పఠనం, దేశనాయకులజీవిత చరిత్రలు చదివించారు. తదుపరి ఎక్కాలుపుస్తకం లేకుండా మల్టిపికేషన్స్ తేలికగా చేయటం నేర్పించారు. చిన్నారులకు పాటలతో లెక్కలు నేర్పించారు. ఎం నదియా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థిని విద్యార్థులకు వివరించిరి. పిఈటీ ఉపాధ్యాయురాలు మణిరత్నం వ్యాయామం, యోగ విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటీ ప్రభ, డి.బాబురావు, వర్షిత, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

కెవికెలో అందుబాటులో విత్తనాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడు డాక్టర్ కే ఎల్ రావు కషి విజ్ఞాన కేంద్రంలో ఉత్పత్తి చేయబడిన వరి వంగడం బిపిటి 5204 ఎఫ్/ఎస్ పునాది విత్తనం 25 కె జి బ్యాగ్ కేజీల ఖరీదు రూ.1125 ఈ నెల 5 వ తేదీ నుండి అమ్మకం ప్రారంభమవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణంరాజు కోరారు. కేవలం ఈ సంస్థలో పండించిన విత్తనం మాత్రమే ఇక్కడ అమ్మబడుతుందని, 1200 బ్యాలులు మాత్రమే అమ్మకానికి ఉన్నాయని అన్నారు. అలాగే జీవ ఎరువులు మరియు ట్రైకోడెర్మా, సూడోమోనాస్ (ద్రవ మరియు ఘన), బాసిల్లస్ మరియు ఇతర ఎన్ పి కె జీవన ఎరువులు కూడ కె వి కె గరికపాడు సేల్ కౌంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎల్ అర్ జి 52 మరియు జిబిజి 1, వాఎల్ బిజి 884 విత్తనాలు కూడా తక్కువ పరిమాణంలో ఉన్నాయని తెలిపారు. ఒక రైతుకు రెండు బ్యాగ్‌ల వరి విత్తనం మాత్రమే సరఫరా చేస్తామని, విత్తనాలు కావలసిన వారు ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకొని రావాలని తెలిపారు.



కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర రావు నోవా ఇంజనీరింగ్ కాలేజీ, జూపూడి నందు జరుగు కౌంటింగ్ గురించి సిబ్బంది కి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం నందు సిబ్బంది కి వారి యొక్క విధివిధానాలు గురించి తెలియజేశారు. జూన్ 4 ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంఅవుతుంది అని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమం నందు పోస్టల్ బ్యాలెట్ మరియు ఈవీఎం మెషిన్ కౌంటింగ్ గురించి సిబ్బందికి కౌంటింగ్ గురించి శిక్షణ వివరించారు. నోవా ఇంజనీరింగ్ కళాశాల నందు రెండొవ ఫ్లోర్ నందు83-నందిగామ ఎస్‌సి అసెంబ్లీ సిగ్మెంట్,12- విజయవాడ పార్లమెంట్ నకు సంబందించిన కౌంటింగ్ కొరకు 16 రౌండ్లకు 14 టేబుల్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. నోవా ఇంజనీరింగ్ కళాశాల నందు మూడోవ ఫ్లోర్ నందు 83-నందిగామ ఎస్సి అసెంబ్లీ నియోజకవర్గంనకు సంబందించిన కౌంటింగ్ కొరకు 16 రౌండ్స్ కు 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు సపోర్టింగ్ ఆఫీసర్ ఎక్సజ్ అండ్ ప్రోహిబిషన్,సూపరిడెంట్ బి శ్రీనాధుడు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-వన్‌టౌన్

తారాపేటలో రోడ్డుపై గుర్తు తెలియని మగ మృతదేహం పడి ఉన్న సంఘటన పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని ఒక మగ వ్యక్తి వయస్సు సుమారు 25 నుంచి 35 సంవత్సరములు విజయవాడ తారా పేట లో వున్న ప్రభుత్వ వైన్ షాప్ దగ్గర అనుమానాస్పద పరిస్థితుల్లో ఒక మగ శవం పడి ఉంది. ఎత్తు సుమారు 5.6, చామనచాయ రంగు కలిగి ఉన్నాడు. నీలం రంగు పై తెలుపు చెక్స్ ఫుల్ హ్యాండ్ షర్ట్. నీలం ఫెడెడ్ జీన్స్ ప్యాంట్ ధరించు ఉన్నాడు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు విజయవాడ వన్‌టౌన్ సిఐ 9440627076, ఎస్ఐ 9440627076 ఫోన్ నంబర్స్‌కు సంప్రదించాలని కోరారు.



వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో శనివారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈఎస్ శ్రీనివాసరావు డయేరియా పంచాయతీ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాటర్ ట్యాంకులో బ్లీచింగ్ కలపాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా క్లీన్ గా ఉంచుకోవాలని, ఈగలు, దోమలు రాకుండా తినుబండరాలపై, ఆహారంపై వాలకుండా చూసుకోవాలని, పరిశుభ్రమైన నీటిని తాగాలని, పొడవాటి గరిటె ఉపయోగించి కుండలోని లేదా బిందెలోని నీటిని తోడి త్రాగాలని, ఇంటి పరిసరాల్లో వాడిన నీరు నిల్వ ఉండకుండా తాగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



తిరుమలగిరిని సందర్శించిన ప్రిన్సిపల్ జడ్జి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక శనివారం స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ అరుణ సారికాకు ఆలయ సిబ్బంది దేవాలయ ఆచారాల ప్రకారం ఆహ్వానం ఫలికారు. అనంతరం స్వామివారిని దర్శించి ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించబడి వేదఆశీర్వచనం పొంది శ్రీ స్వామి వారి తీర్థప్రసాదములు అందజేశారు ఆమెతోపాటు జగ్గయ్యపేట సీనియర్ సివిల్ జడ్జి మరియు ప్రిన్సిపల్ జడ్జి వారు శ్రీ స్వామివారి దర్శనం చేసుకుని యున్నారు అని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సి. జయ ప్రకాష్ బాబు తెలిపారు.



కౌంటింగ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం నిమ్రా, నోవా కళాశాలల ప్రాంగణంలో 4వతేదీ కౌంటింగ్ నేపథ్యంలో స్ట్రాంగ్ రూం లలో ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల ఈవీఎంలను అధికారులు భద్రపరిచారు. సీసీ కెమెరాలను, ముళ్ళ కంచెలను ఏర్పాటు చేసి కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



నందిగామలో వాలంటీర్లకు అందని జీతాలు..!

ప్రజాశక్తి-నందిగామ: వాలంటీర్లకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న నందిగామ మున్సిపల్ కమిషనర్ జయమాలిని పని తీరుపై విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో మండల స్తాయిల్లో గ్రామ స్థాయిలో వాలంటీర్లకు జీతాలు చెల్లిస్తుంటే నందిగామ పట్టణంలో మాత్రం కమిషనర్ వచ్చిన నెలలో "కీ"రాలేదు అని జీతాలు నిలిపి వేశారు. నందిగామ పట్టణంలో సుమారు రెండు వందల కు పైగా వాలంటీర్లు వున్నారు. ఈ నెల జీతాలు పక్క గ్రామాల్లో చెల్లించిన కూడా ఇంకా నందిగామ పట్టణంలో జీతాలు పడక పోవడం పై వాలంటీర్ లు ఆందోళనకు గురౌతున్నారు. ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితులలో వాలంటీర్లు ఉన్నారు. వార్డు కౌన్సిలర్ల ను వార్డ్ ఇన్చార్జి లను అడిగితే మొహం చాటి వేస్తున్నారని వాలంటీర్లు వాపోతున్నారు. నందిగామ పట్టణంలోనే ఎందుకు వాలంటీర్ల పై వివక్షత చూపిస్తున్నారు ని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు పని చేయించుకొని మాకు జీతాలు ఇవ్వకపోతే ఎలా అని తమ బాధను పంచుకుంటున్నారు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన గానీ జీతాలు చెల్లించడంలో జాప్యం ఏమిటో చెప్పాలని నందిగామ పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎంతో మంచి పేరు ఉన్న నూతన కమిషనర్ ఇకనైనా తమ రెండు నెలల జీతాలు చెల్లించాలని వాలంటీర్లు కోరుతున్నారు

హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గత మూడు సంవత్సరాలుగా పౌష్టికాహారం అందజేస్తున్న కార్యక్రమం ఈ సంవత్సరం కూడా నిర్వహించనున్నట్లు కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. శనివారం తన ట్రస్ట్ కార్యాలయంలో హెచ్ఐవి బాధిత పిల్లలకు జూన్ మాసానికి పౌష్టికాహారాన్ని అందజేశారు. 2021జూన్ 1న తన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రారంభించిన ఈ పంపిణీ కార్యక్రమం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని నాలుగవ సంవత్సరంలోకి అడుగు పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరొక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భావసారూప్యమున్న స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో డ్రగ్ రహిత సమాజం కోసం కషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జాతీయ స్థాయి సంస్థలతో ఒక అవగాహనకు రావడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతో ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అడ్వైజర్ రామకష్ణ , శ్రేయస్సు ప్రతినిధులు రాజశేఖర్, విజయ కుమారి, కె వి ఎం ఎస్ ప్రతినిధి రుక్మిణి ట్రస్ట్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ధరలేక మామిడి రైతు కుదేలు

- ఆశించిన స్థాయిలో దిగుబడులు లేని వైనం
- మామిడి మార్కెట్లలో తగ్గిన కళ
- వ్యాపారాలు లేక రైతుల దిగాలు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం డివిజన్లో మామిడి రైతుల జీవితాల్లో తియ్యదనం కరవైంది. మామిడిని పండించిన రైతులు ఈ ఏడాది దిగుబడిలోనూ, ధరలోనూ పెద్దగా ప్రగతి లేకపోవడంతో కుదేలయ్యారు. మామిడి తమ జీవితాలను తీపిమయం చేయలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం, విజయవాడ రూరల్, బాపులపాడు మండలంలోని పలు గ్రామాలు మామిడికి ఎంతో ప్రసిద్ధి. ఏటా ఇక్కడ నుంచి లక్ష టన్నుల వరకు ఇతర ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడం, కాసిన అడపాదడపా తోటల్లోనూ దిగబడులు వచ్చినా.. వాటికి అనుకున్న స్థాయిలో ధరలు లేకపోవడంతో మామిడి మార్కెట్లలో కళ తగ్గింది. వ్యాపారాలు బోసిపోతున్నాయని వ్యాపారులు దిగులు చెందుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి మామిడి తోటలను కొనుగోలు చేసిన రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదని ఆందోళన చెందుతున్నారు. గన్నవరం, బాపులపాడు తదితర మార్కెట్లకు పెద్దఎత్తున మామిడి వ్యాపారం ఉండేది. ఆశించిన మేర దిగుబడులు లేకపోవటంతో కొందరు కొనుగోలుదారులు పొలాల వద్దకు వెళ్లి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. గన్నవరం డివిజన్లో 16 వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, చీడపీడలతో అనుకున్న స్థాయిలో దిగుబడులు రాలేదు. ఎకరాకు 2 టన్నుల వరకు మాత్రమే వచ్చాయంటున్నారు. టన్ను బంగినపల్లి రకం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతోందని చెప్పారు. ఏటా దాదాపు రూ. కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు మామిడి ఉత్పత్తుల ద్వారా టర్నోవర్ జరిగేదని, ఈ ఏడాది అంత ఎత్తున జరగలేదంటున్నారు. మామిడిలో తోతాపురి, రసాలు, ఇతర రకాలకు సంబంధించిన వాటి ధరలు కూడా మరింతగా దిగజారాయని చెబుతున్నారు. వాటి ధర కూడా రూ.12 వేల నుంచి రూ.20 వేల లోపు మాత్రమే ఉన్నాయని, వచ్చిన అంతంతమాత్రం దిగుబడులతో ఈ ధరలు మరింతగా తమను కుంగ దీస్తున్నాయని చెబుతున్నారు. మార్కెట్లలో వ్యాపారుల వద్ద మాత్రం రసం కాయ రూ.50 నుంచి 60 వరకు ధర పలుకుతున్నా... రైతుల జీవితాల్లో మాత్రం కాంతులీనడం లేదు. అయితే కమిషన్ వ్యాపారులు బాగా లాభం పొందుతున్నారని వాదన ఉంది. వ్యాపారులను కేంద్రంగా చేసుకొని వీరు పెద్ద ఎత్తున లాభం గడిస్తున్నారు.

గతేడాది కంటే తక్కువే

రాంబాబు , వ్యాపారి

గతేడాది నాలుగైదుతోటల్లో మామిడిని రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చుపెట్టి కొనుగోలు చేశాం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో తోటల దగ్గరికెళ్లి కొనుగోలు చేయాలంటేనే భయపడ్డాం. ఎలాగోలా ధైర్యం చేసి మామిడితోటలు కొనుగోలు చేశాం. దిగుబడులు పెద్దగా రాలేదు, కనీసం ధరలైనా ఆశించిన స్థాయిలో ఉంటాయనుకుంటే వాటి పరిస్థితి దారుణంగానే తయారైంది.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో సేంద్రియ సాగు విజయవంతం

ప్రజాశక్తి-గుంటూరు : సేంద్రియ వ్యవసాయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించగలిగితే ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని రిటైర్డ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం అన్నారు. శనివారం రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండిరచిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై గుంటూరు జిల్లా, పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడు గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో జరుగుతున్న మూడు రోజుల రైతు శిక్షణా కార్యక్రమంలో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో రామచంద్రం, డిపిఎం కె.రాజకుమారి, సేంద్రియ రైతు శివనాగమల్లే శ్వరరావు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రామచంద్రం మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం వలన అనేక అనర్ధాలు జరుగుతున్నాయని, కాబట్టి అందుకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ సాగు లేదా ప్రకతి సాగును రైతులు మొదలు పెడుతున్నారన్నారు. సేంద్రియ, ప్రకతి సాగులో దేశీయ జాతి ఆవుల యొక్క పేడ, మూత్రాలతో పాటు వేపాకు, సీతాఫలం ఆకు, కానుగ ఆకు, జిల్లేడు ఆకు, వావిలాకు, ఉమ్మెత్తాకు లాంటి వివిధ రకాల ఆకులతో పాటు వెల్లుల్లి, పచ్చిమిర్చి, పొగాకు పొడి లాంటి వాటిని కలిపి అనేక రకాల కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకుని పంటలపై ఉపయోగించి పంటలను ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా చీడ పీడల నుండి పంటలను కాపాడుకోవచ్చు. వివిధ రకాల కషాయాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ వీటి గురించి సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించడం జరిగింది.

డి.ఎడ్ పరీక్షల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు : డి.ఎడ్ ద్వితీయ సంవత్సరం 2022-24 రెగ్యులర్, 2020-22, 2021-23 ప్రైవేటు బ్యాచ్‌లకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో జరిగిన పరీక్ష ఫలితాలు ప్రకటించటం జరిగిందని డిఇఒ పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితా షషష.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు జూన్ 10వ తేదీ వరకూ ప్రతి సబ్జెక్టుకు రూ.500ల చొప్పున నేరుగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు చెల్లించాలని తెలిపారు.

నూతన డిఎస్‌డిఒగా నరసింహారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా పి.నరసింహారెడ్డి శనివారం స్థానిక బిఆర్ స్టేడియంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం క్రీడా శిక్షకులను, సిబ్బందిని కలిసి క్రీడలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కృషి చేస్తూ తమ వంతు సహకారం అందజేస్తామని తెలియజేశారు.

కెఎల్‌యులో నూతన స్టార్టప్ యజమానులకు చెక్కులు పంపిణీ

ఘనంగా ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ మాట్లాడుతూ భారతదేశంలో నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత యొక్క ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకంలో దేశవ్యాపితంగా నూతన ఆవిష్కరణలు చేపట్టినవారికి నిధులు ఇచ్చేందుకు ఆవిష్కరణలు చేపట్టిన వారిని ధరఖాస్తులు చేసుకోమని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కెఎల్ యు లో ఉన్న ఎసిఐసి వారు ప్రకటన జారీ చేశారని విసి పార్ధసారధివర్మ తెలిపారు. దీంతో దేశ వ్యాప్తంగా ఎనిమిది వందల ధరఖాస్తులు వచ్చాయన్నారు. వారిలో కంపెనీ రిజిస్ట్రేషన్ , కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న ఆయా స్టార్టప్ లకు నిధులు మంజూరు చేయవచ్చునని ఇంక్యుబేటర్ సీడ్ మేనేజ్ మెంట్ కమిటీ సూచనల మేరకు కెఎల్ యు లో ఉన్న ఎసిఐసి కమిటీ వారు అర్హత సాధించిన విజేతలకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెఎల్ యు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ చేతుల మీదుగా అర్హులైన నూతన స్టార్టప్ యజమానులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎసిఐసి సిఇఒ రమణ్ కాంత్ మాట్లాడుతూ యుక్తి, స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ అనే రెండు కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు గ్రాస్ రూట్ ఇన్నోవేటర్స్ ఐడియాథాన్ లు అనే మూడు పథకాల నుండి స్టార్టప్‌లకు మొత్తం రు. 45 లక్షలు నిధులను పంపిణీ చేసినట్లు తెలిపారు. యువత ఉద్యోగాల కోసం తిరగడానికి



స్వస్తి పలికి పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాలని పిలుపునిచ్చారు. సరికొత్త ఆలోచనలకు కేంద్ర ప్రభుత్వం కెఎల్ యులో ఉన్న ఎసిఐసి అనే విభాగం ద్వారా నూతన ఆవిష్కరణలు చేపట్టిన వారిని ప్రోతసహిస్తుందని అన్నారు. రానున్న కాలంలో మరిన్ని నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి వారికి కూడా నిధులను మంజూరు చేయడానికి తాము సిద్దంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రోఫెసర్ వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కుర్రా రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎసిఐసి సిఇఒ రమణ్ కాంత్, డాక్టర్ సిఐఐఇ డైరెక్టర్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లు ఊడ్చి నిరసన తెలియజేస్తున్న దృశ్యం

రోడ్లు ఊచ్చి వ్యాన్ డ్రైవర్ల నిరసన

పెనమలూరు : వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ లో పనిచేస్తున్న వ్యాన్ డ్రైవర్ల సమ్మెలో భాగంగా శనివారం రోడ్లు ఊడ్చి నిరసన తెలియజేశారు. అనంతరం పెనమలూరు మండలం సిఐటియు ఉపాధ్యక్షులు మస్తాన్వలి మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాన్ డ్రైవర్ సమస్యలు పరిష్కరిం చాలన్నారు. వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్షురాలు వై. సరళ మాట్లాడుతూ కార్మికు లందరూ ఐక్యతతో పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అనేక సమస్యలు ఐకమత్యంతో పోరాడి సాధించుకున్నామని,మీ సమస్యలు పరిష్కార మయ్యే వరకు మద్దతుగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు పెనమలూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, తాడిగడప మున్సిపాలిటీ వాన్ డ్రైవర్ల సిఐటియు సహాయ కార్యదర్శి ఏ నజీర్, సిహెచ్ సుధాకర్, ఎస్ దుర్గారావు, సుబ్రమణ్యం, పని పోషణరావు, బాజీ, శ్రీనివాసరావు, సాయి కార్తీక్, కిషోర్ వ్యాన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

- ఎన్నికల సంఘాన్ని కోరిన వైసిపి బృందం

ప్రజాశక్తి-విజయవాడ : కౌంటింగ్ రోజున అల్ల ర్లు సష్టించేలా తెలుగుదేశం కౌంటింగ్ ఏజంట్లను రెచ్చగొడుతున్న చంద్రబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని వైసీపీ బృందం కోరింది. ఈ మేరకు శనివారం వెలగపూడి సచివాలయం నందు డిప్యూటీ సీఈఓ విశ్వేశ్వరరావును కలిసి సెంట్రల్ ఎంఎల్ఎ మల్లాది విష్ణు ఫిర్యాదునందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలు సృష్టించేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని మల్లాది విష్ణు ఆరోపించారు. తెలుగుదేశం కౌంటింగ్ ఏజంట్లకు ట్రైనింగ్ క్యాంపులో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. వైసీపీ కౌంటింగ్ ఏజంట్లను తరిమికొట్టాలని.. కౌంటింగ్ ప్రాంతంలో లేకుండా చేయాలని రెచ్చగొట్టేలా బాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ అధినేతకు ఓటమి భయం పట్టుకుందని.. కనుకనే అల్లర్లు సృష్టించి ఈ ఎన్నికలలో గెలుపొందేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. విధ్వంసాలు, ఘర్షణలతో ప్రజాతీర్పును మార్చేందుకు ప్రయత్నిస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎక్కడా దౌర్జన్యకాండ జరగకుండా అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి.. కఠినంగా వ్యవహరించాలని ముందస్తుగా ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, నవరత్నాల కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న మల్లాది విష్ణు



స్పార్క్ చెస్ అకాడమీ విద్యార్థి నిశ్చల్ ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆలిండియా చిల్డ్రన్స్‌చెస్ టోర్నమెంట్‌లో నగరంలోని స్పార్క్ చెస్ అకాడమి విద్యార్థి తల్లా నిశ్చల్ అత్యంత ప్రతిభ కనపరచి విజేతగా నిలిచాడని స్పార్క్ చెస్ అకాడమి కోచ్ అండ్ సెక్రటరీ టి.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గుజరాత్ అకాడమి నందు జరిగిన ఆలిండియా అండర్ -15 చెస్ టోర్నమెంట్ జరిగిందని ఇందులో 8 పాయింట్లకుగాను నిశ్చల్ 7.5 పాయింట్లు సాధించి ప్రథమ స్థానం సాధించాడని తెలిపారు. తల్లా నిశ్చల్ తమ అకాడమిలో శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు తొమ్మిదవ తరగతి చదువుతున్నాడని తెలిపారు. నిశ్చల్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలవడంతో పాటుగా రు. 5వేలు నగదు బహుమతి కూడా సాధించాడని తెలిపారు. ఈసందర్భంగా నిశ్చల్‌ను నగరంలోని పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

కెబిఎన్ అధ్యాపకుడు విజయబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ విభాగ అధ్యాపకులు టెక్కెం విజయబాబుకు ద్రవిడన్



విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లోని పలు అంశాలపై సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు. విజయబాబు కాకరపర్తి భావనారాయణ కళాశాలలో పలు హెూదాల్లో పని చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల కార్యనిర్వాహక వర్గం విజయబాబును అభినందించారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-వత్సవాయి: జూన్ నెల వచ్చింది... రుతుపవనాలు మరికొద్ది రోజుల్లో రాష్ట్రాన్ని తాకనున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ తరుణంలో రైతులు విత్తన ఎంపికలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నిన రైతులు ఏ రకం విత్తనం కొనుగోలు చేస్తే పంట దిగుబడి అధికంగా వస్తుందోనని ఆలోచనలో ఉన్నారు. విత్తనాలు కొలుగోలు చేసే సమయంలో రైతుల అప్రమత్తంగా ఉండాలని లేని పక్షంలో మార్కెట్లో కల్తీ విత్తనాలు బారినపడి నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందుకే వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న డీలర్ల వద్ద నుంచే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలి. దుకాణదారుడు నుంచి ఖచ్చితంగా రశీదు తీసుకోవాలి. అప్పుగా విత్తనాలు కొనుగోలు చేసినా రశీదు తప్పనిసరి. మార్కెట్ ధర కంటే తక్కువకే ఇస్తామని చెబితే నమ్మకూడదు. కంపెనీ పేరు లేనివి, లూజుగా కిలోల చొప్పున ఇచ్చే విత్తనాలను రైతులు కొనుగోలు చేయకూడదు. కొనుగోలు చేసిన విత్తనాలకు కంపెనీ సీలు ఉందో లేదో తెలుసుకోవాలి. మలక శాతాన్ని పరిశీలించి సంతృప్తిగా ఉంటేనే నాటుకోవాలి. మొలకెత్తే దశలో విత్తన లోపాలు కనిపిస్తేనే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. విక్రయదారుడు ఇచ్చే బిల్లును పంట పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి అని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

చెత్త పన్నుపై పోరాటం తప్పదా?





నూతన ప్రభుత్వంలో చెత్త పన్ను బాదుడు ఏ మేరకు ఉంటుందో...అసలు ఉండదోనని చర్చ నడుస్తుంది. ఓట్ల రాజకీయంలో టిడిపి తాను ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్ను ఎంత వరకు రద్దు చేస్తుందో ...అలాగే వైసిపి ప్రస్తుతం నిలుపుదల చేసిన పన్నును మరలా ఎంత మేర కొనసాగిస్తుందోనని నగర ప్రజల్లో గుబులు రేగుతోంది. చట్ట విరుద్ధమైన చెత్త పన్నును పూర్తిగా రద్దు చేసేంత వరకు మరో పోరాటానికి సిద్ధంగా ఉండాలని పౌర వేదికలు, పౌర సమాజం, ఇతర ప్రజాసంఘాలు పిలుపునిస్తున్నాయి. చెత్త పన్ను రూపంలో నగర ప్రజలపై నగరపాలక సంస్థ భారీ మొత్తంలో భారం మోపుతోంది. దీని నేపథ్యాన్ని ఒక సారి పరిశీలిస్తే...విజయవాడ నగరపాలక సంస్థ వివిధ రకాల సేవల మాటున తీవ్రమైన దోపిడీ, దందాకు పాల్పడుతుంది. చెత్త పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, పార్కింగ్ ఫీజులు, ఆస్తి విలువ ఆధారిత పన్ను తదితర రూపాల్లో ఏడాదికి వందల కోట్లు ప్రజల వద్ద నుంచి నగరపాలక సంస్థ ముక్కుపిండి వసూలు చేస్తుంది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ప్రజల నుంచి ఎక్కడ వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తుందోనని, ఓట్లు రాలవనే భయంతో...కొంత వెనుకంజ వేసి, చెత్త పన్ను వసూలు ప్రక్రియకు నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. కానీ జూన్ 4 తరువాత రాష్ట్రంలో నూతనంగా వైసిపి, టిడిపిల్లో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా "చెత్త పన్ను భారం తప్పదని, అప్పటి వరకు ఆ కత్తి ప్రజల మెడ మీద వేలాడుతూనే ఉంటుందని స్వయంగా ప్రజారోగ్య విభాగంలోని పలువురు దిగువ స్థాయి అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

నగరపాలక సంస్థలో ప్రజారోగ్యం నిర్వహణ అనేది రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. దీనికి నిధులు ప్రభుత్వం కేటాయించాలి. అలాగే ప్రజారోగ్యంలో భాగమైన శానిటేషన్ నిర్వహణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి. 4వ ఆర్థిక సంఘం శిఫారస్సుల మేరకు పట్టణాలకు 3.26 శాతం, అలాగే స్థానిక సంస్థలకు 6.5 శాతం మొత్తంగా 9.76 శాతం రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో నుంచి ప్రతి ఏటా క్రమం తప్పకుండా కేటాయించి, నిధులను విడుదల చేయాలని 2019లో విడుదల చేసిన రాష్ట్ర 4వ ఆర్థిక సంఘం శిఫారస్సులు స్పష్టం చేస్తున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం పట్టణ సంస్కరణలో భాగంగా నగరపాలక సంస్థలో శానిటేషన్ నిర్వహణకు అవసరమైన నిధుల్లో ఒక్క పైసా కూడా రాష్ట్రత ప్రభుత్వం మంజూరు చేయకపోగా, దానికయ్యే వ్యయం మొత్తాన్ని నగరపాలక సంస్థలు నిర్వహించుకోవాలని...చెత్త సేకరణ, శానిటేషన్ నిర్వహణకయ్యే కోట్లాది రూపాయల ఖర్చును మొత్తాన్ని ప్రజల నుంచే రాబట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చెత్త పన్ను రూపంలో గత మూడేళ్ల నుంచి కోట్లాది రూపాయలను ప్రజల నుంచి నగరపాలక సంస్థ వసూలు చేస్తుంది.

చెత్త పన్ను రూపంలో విఎంసి బాదుడు

చెత్త పన్ను రూపంలో (యూజర్ ఛార్జీలు విఎంసి ముద్దుపేరు) నెలకు రూ. కోటి 50 లక్షలు, ఏడాదికి రూ.18 కోట్లకు పైగా విజయవాడ నగర ప్రజలపై నగరపాలక సంస్థ భారం మోపుతోంది. ప్రతి నెలా ఆయా సచివాలయాల సెక్రటరీల ద్వారా వసూలు చేయిస్తున్నారు. శానిటేషన్ మెరుగుదల చేయడం ఏమో కానీ... చెత్త పన్ను రూపంలో విఎంసి బాధుడు పెరిగిపోతోంది. చెత్త పన్ను చెల్లించకపోతే పింఛన్, ఇతర పథకాలు ఆగిపోతాయని, బెదిరింపులకు దిగుతూ... అతి బలవంతంగా, చివరకు పోలీసుల బలగాలను ఉపయోగించి నగరపాలక సంస్థ అధికారులు వసూలు చేయిస్తున్నారు. విజయవాడ నగర వ్యాప్తంగా నెలకు రూ. కోటిన్నరకు పైగా చెత్త పన్ను రూపంలో గృహాల నుంచి వసూలు చేస్తున్నారు.. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ప్రజల నుంచి ఎక్కడ వ్యతిరేకత మూట కట్టుకోవాల్సి వస్తుందని, ఓట్లు రాలవనే భయాందోళనతో చెత్త పన్ను వసూలును తాత్కాలికంగా ఆపేయాలని ప్రభుత్వం నుంచి, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి మౌఖిక ఆదేశాల నేపథ్యంలో అధికారులు పూర్తిగా నిలుపుదల చేయకుండా 50 శాతం మేరకు వసూలు చేస్తున్నట్లు ప్రజారోగ్య విభాగం అధికారుల నుంచే సమాచారం వినిపిస్తుంది. మూడు లక్షల 28 వేల గృహాల నుంచి ఈ చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. వీటిల్లో కూడా 28 వేల వరకు వ్యాపార సముదాయాలు (ట్రేడర్స్) నుంచే రూ. 70 లక్షల మేర చెత్తపన్ను వసూలు అవుతుంది. పేదల ఆవాసాల నుంచి రోజుకు రూ.2 చొప్పున రూ.60 నెలకు, అలాగే రూ. 4 చొప్పున రూ. 120 నెలకు (ఏడాదికి రూ.1440) మధ్యతరగతి ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న హెూటల్స్ దగ్గర నుంచి పెద్ద పెద్ద రెస్టారెంట్లు, మాల్స్ ఇలా వ్యాపారాలకు సంబంధించిన ఒక్కొక్క దాని నుంచి రూ.ఐదు వేల నుంచి రూ.30-40 వేల వరకూ కూడా నెలకు విఎంసి చెత్త పన్ను రూపంలో వసూలు చేస్తున్నారు. వ్యాపార వర్గాల నుంచి వసూలు చేసే చెత్త పన్ను భారం పరోక్షంగా ప్రజల నెత్తినే మోపాల్సి వస్తోందని వ్యాపారులే వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటువంటి చట్ట విరుద్ధమైన చెత్త పన్ను వసూలును నిలుపుదల చేయాలని ప్రజలు, పౌరవేదికలు, ప్రజాసంఘాలు, వామపక్షాలు చేస్తున్న ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చెత్త పన్ను చెల్లించడానికి కొందరు నిరాకరిస్తున్న పరిస్థితి లేకపోలేదు. ప్రజలకు భారంగా తయారయిన ఈ చెత్త పన్నును ఆస్తి పన్నులో ఐదు శాతం వసూలు చేయాలని 2019లోనే 4వ ఫైనాన్స్ కమిషన్ శిఫారస్సుల మేరకు రానున్న కాలంలో ఈ మేరకు పన్నును వసూలు చేస్తారో లేక ప్రస్తుతం వసూలు చేస్తున్నట్లు యూనిఫామ్‌గా రూ. 60, రూ. 120 , ఆ పైన చెత్త పన్ను వసూలు చేస్తారో వేచి చూడాల్సిందే. ఓట్ల రాజకీయంతో తాత్కాలికంగా చెత్త పన్ను భారం కొంత ఆగినా కానీ...రానున్న కాలంలో మరింత పెంచి చెత్త పన్ను వసూలు చేసే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎంత వరకు నిలుపుకుంటుందో వేచి ఉండాల్సిందే. ఒక వేళ టిడిపినే అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీకి కట్టుబడకుండా చెత్త పన్ను వసూలు చేస్తామంటే మరో పోరాటం తప్పదని ప్రజాసంఘాలు, పౌర వేదికలు స్పష్టం చేస్తున్నాయి.

- రాజు

అతిసార బాధితులను ఆదుకోకుంటే ఉద్యమం

- **మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి**
- **ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు**



మొగల్రాజపురంలో ధర్నా చేస్తున్న బాధితులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: అతిసార బారిన పడిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే బాధితుల తరుపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు హెచ్చరించారు. మొగల్రాజపురం ప్రాంతానికి కృష్ణానది రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని, మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని, డయేరియాతో బాధపడుతూ వైద్యశాలల్లో చికిత్సపొందుతున్న వారికి రూ. 25 వేల చొప్పున వైద్య ఖర్చులు భరించాలని కోరుతూ మొగల్రాజపురం బోయపాటి మాధవరావు వీధిలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో మృతుల కుటుంబ సభ్యులను కలుపుకొని ధర్నా నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ విజయవాడలో తొమ్మిది మంది మృతి చెందినా ప్రభుత్వంలో, నగరపాలక సంస్థ అధికారుల్లో ఎటువంటి చలనం లేదని దుయ్యబట్టారు. గత పది రోజుల నుంచి వందల మంది డయేరియా బారిన పడి తీవ్రంగా బాధపడుతున్నా...సంబంధిత కుటుంబ సభ్యులు పలు రూపాల్లో ఇబ్బందులు పడుతున్నా వారిని ఆదుకోకపోగా, నిందలు వేయడం సరికాదన్నారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో మంచినీటి పైపుల ద్వారా వస్తున్న నీరు రంగుమారి దుర్వాసన, మట్టితో కూడిన నీరు వస్తున్నా అధికారుల్లో ఎటువంటి చలనం లేదని, దీనిని బట్టి నగరపాలక సంస్థలో అధికారపక్షం ఉందా లేక నిద్రపోతుందా అని తీవ్రంగా మండిపడ్డారు. దీనికి అధికార వైసిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుద్ధి చేసిన కృష్ణానది నీటిని సరఫరా చేయాల్సిన నగరపాలక సంస్థ కలుషిత నీటిని సరఫరా చేస్తూ ప్రజలను రోగాలకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు పెంచుతూ ఆదాయాలు పెంచే దానిపై ఉన్న శ్రద్ధ ప్రజలను కాపాడటంలో లేదని విమర్శించారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున, అలాగే వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చుల క్రింద రూ. 25 వేలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని గత రెండు మాసాల క్రితమే సిపిఎం నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినా పట్టించుకునే నాధుడే లేకుండా పోయిందని అన్నారు. రాబోయే మంచినీటి ఎద్దడి, నీటి కాలుష్యంపై హెచ్చరించినా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఎంసి విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.మురహరి, డి శ్రీనివాసరావు, జి.క్రాంతి, పి.స్టాలిన్, డి.నగేష్, వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.